విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణంగా ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎంకే మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జూన్ 4న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షించిన అనంతరం, కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్కు హాజరై జిల్లాలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ఎన్నికల సంఘం సీఈఓ కు వివరించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13న పోలింగ్ జరిగిన నేపథ్యంలో కృష్ణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టటకు పటిష్టవంతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గం పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు వేరు వేరు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేసినట్లు, పార్లమెంటు, అసెంబ్లీ ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్ళు, ప్రతి టేబుల్ కు కౌంటింగ్ సూపర్వైజర్ తో పాటు ఇద్దరు కౌంటింగ్ సహాయకులు, ఒక్కొక్క మైక్రో అబ్జర్వర్ లను నియమించామని, వీరికి విధులు కేటాయించుటకు ఈనెల 26వ తేదీన మొదటి ర్యాండమైజేషన్, జూన్ 3 తేదీన రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కె చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కంచడం గ్రామాభివృద్ధికి కేంద్రం నిధులు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- కృష్ణాజిల్లాలో అభివృద్ధి పథంలో 1వ స్థానంలో ఉన్న కంచడం గ్రామ సచివాలయాన్ని గురువారం కేంద్ర బృందం సందర్శించి గ్రామాభివృద్ధికి రూ.5 లక్షల కేంద్ర నిదుల నుండి మంజూరు చేశారని బంటుమిల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా బంటుమిల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణంరాజు మాట్లడుతూ కంచడం సచివాలయాన్ని న్యూఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియట్లో పనిచేస్తున్న ఐదుగురు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం శ్రీ మయాంక్ కుమార్ సింగ్, విపుల్ పన్వార్, సుధాంశు ఆనంద్, పవన్ కుమార్ శర్మ, శశికాంత్ శర్మ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ సెంట్రల్ సెక్రటేరియట్ డిపార్ట్మెంట్ ఆఫ్ హోం అఫైర్స్ నుండి ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించడానికి గ్రామ అనుబంధ కార్యక్రమంలో భాగంగా కంచడం సచివాలయం, హెల్త్ వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. సచివాలయ సిబ్బందితో అక్కడ ఉన్న అధికారులతో చర్చించి వివిధ పథకాలు వాటి అమలు, రిజిస్టర్లను పరిశీలించారన్నారు. గ్రామంలో జరగుతున్న గ్రామాభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో క్షున్నంగా పరిశీలించి కేంద్ర బృందం సంతృప్తి చెందారన్నారు. అనంతరం సచివాలయ పరిసరాలాభివృద్ధికి నిధులను మంజూరుచేయాలని సర్పంచ్ బందారు చంద్రశేఖర్ కేంద్ర బృందాన్ని కోరగా, కేంద్రం నిధుల నుండి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాపాని భగవాన్, ఇఓపిఆర్డీ త్రిపురసుందరి, గ్రామ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, ప్రదీప్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి కాలనీలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ డి.ఎస్.పి పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ సర్కిల్ పరిధిలోని గుడివాడ మండలం మల్లాయి పాలెం శివారు శ్రీకాళహస్తి కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో 11 ద్విచక్ర వాహనాలుకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడం గుర్తించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం కౌంటింగ్ వరకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడటం, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఈ ప్రాంతాలకు వచ్చి అల్లర్లు సృష్టించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. చట్ట వ్యతిరేకంగా మద్యం, పెట్రోల్, డీజిల్ వంటివి కలిగి ఉండరాదని డిఎస్పి శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ తాలూకా సి.ఐ కె.యేసుబాబు, తాలుకా ఎస్ఐ, నందివాడ ఎస్సై, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమాఖ్య రికార్డుల తనిఖీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : పెదపారుపూడి వైఎస్ఆర్ క్రాంతి పదం కార్యాలయంలో మహిళ మండల సమైక్య రికార్డులను గురువారం లీగల్ కోఆర్డినేటర్లు బాపనయ్య బృందం ఏపిఎం వసంతరావు ఆధ్వర్యంలో ఇంటర్నల్ ఆడిట్ లో భాగంగా రికార్డులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాపనయ్య మాట్లాడుతూ 2023- 24 సంవత్సరానికి గాను ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు ఏసమ్మ, చిట్టి, నాగమణి, లూర్దు మేరీ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న ఏలేరు జలాలు

- ఆందోళనలో మెట్ట రైతులు
-బీడు భూములుగా తిమ్మరాజు చెరువు
-నిరుపయోగమైన పుష్కర ఎత్తిపోతల పథకం
-తీవ్ర నష్టాల్లో వ్యవసాయ రైతాంగం



విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): మెట్ట ప్రాంతాల్లో అతిపెద్ద జలాశయం ఏలేరు జలాశయం. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఏలేరు నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురవక ఏలేరు జలాలు అడుగంటాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరో నెల, రెండు నెలల కాలంలో జలాశయంలో చుక్క నీరు కూడా ఉండని పరిస్థితి. ఇప్పటికే మండలంలో చిన్న చిన్న చెరువులన్నీ వర్షాలు లేక ఎండిపోయాయి. మండలంలోనే ఉన్న మరో పెద్ద చెరువు తిమ్మరాజు చెరువు. దీనిలో మరో వారంలో చుక్కనీరు కూడా ఉండని పరిస్థితి. తిమ్మరాజు చెరువులో నీటి సమస్య తలెత్తినప్పుడు ఏలేరు రిజర్వాయర్ నీటిని చెరువుకు విడుదల చేసేవారు. గత ప్రభుత్వ కాలంలో నీరు అందక రైతులు అల్లాడిపోతుంటే పుష్కలంగా నీరు అందించేందుకు గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పుష్కర ఎత్తిపోతల పథకంను ప్రారంభించి ఏలేరు రిజర్వాయర్ కు పూర్తిస్థాయిలో నీరు అందించడం జరిగిందని ఇక్కడి రైతులు తెలుపుతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లోకి నీరు అందించడం తగ్గించి ప్రస్తుతానికి రిజర్వాయర్ లోకి నీరు లేకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో రిజర్వాయర్ లోనే నీటి కొరతతో జలాలు అడుగంటడంతో అధికారులు నీటిని విడుదల చేసినా చెరువుకు అందే పరిస్థితి లేదు. ఏలేరు రిజర్వాయర్ పుష్కలంగా నీరు ఉన్నప్పుడు దిగువ ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఇంకి పోవడం సర్వసాధారణం. దీంతో కొన్ని వ్యవసాయ బోర్లలో చుక్కనీరు రాదు. 86.56 మీటర్ల స్థాయిలో టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లో ప్రస్తుతం 68. 83 మీటర్ల స్థాయిలో కేవలం 3.75 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి.

ఏలేరు జలాలు కనిష్ట స్థాయి కంటే తక్కువగానే ఉన్నాయి. ఇది ఏలేరు అధికారులకు ఆందోళన కలిగించే విషయమే. సాంకేతికంగా ఇది ప్రాజెక్టుకు అనర్ధదాయకమే. అయినప్పటికీ విశాఖకు 125 క్యూసెక్కులు, అవుట్ ఫ్లోగా 190 క్యూసెక్కులను ఏలేరు అధికారులు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్లోకి 12 క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్ ఫ్లోగా వచ్చి చేరుతుంది. ఇక తిమ్మరాజు చెరువు విషయానికి వస్తే అసలు నీరు లేక చిన్న చిన్న చేపలను కొంగలు, నీటి బాతులు వేటాడేస్తున్నాయి. ఇది చెరువును నిర్వహణకు తీసుకున్న ఫిషర్మెన్ సొసైటీకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. మొత్తానికి తిమ్మరాజు చెరువు పశువులు మేత మేసే బీడు భూములుగా దర్శనమిస్తుంది.

దిడ్ల మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిది : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు దిడ్ల.వీర రాఘవులు మృతి దివిసీమ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ విచారం వ్యక్తంచేశారు. మండల పరిధిలోని అశ్వారావుపాలెంలో గురువారం వీర రాఘవులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత కలిగిన నిజాయితీ గలనాయకుడిని కోల్పోయిందని , దివిసీమ ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని, స్వార్థం ఎరుగని నాయకుడు, ఏ సమస్య ఏదైనా స్పందించే నాయకుడిని కోల్పోయింది న్నారు . రాఘవులు అకాల మరణానికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, పుల్లగోరు రాజేంద్ర రావు, కొండవీటి మధుసూదన్ రావు, దాసినేని శ్రీనివాసరావు, రేపల్లె వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

విశాలాంధ్ర-కూచిపూడి: వేసవి సెలవుల అనంతరం వచ్చేనెల 12వ తారీకున పాఠశాలల తలుపులు తెరుచుకొనేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు తో పాటు ఏకరూప దుస్తులు, బ్యాగులు, బూట్లు, మేజోళ్ళు, లాంటి విద్యా కానుకలు విద్యార్థులకు అందాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వపాఠశాలల పునః ప్రారంభంకుమూడువారాల ముందుగానే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు విడుదలైనాయి. దీనిలో భాగంగానే మొవ్వ మండలంలోని కూచిపూడి (ఓరియంటల్), పెదసనగల్లు, భట్లపెనుమర్రు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ లలోని జిల్లా పరిషత్ హై స్కూల్ తో పాటు పెదముత్తేవి ఓరియంటల్ (ఎయిడెడ్) హై స్కూలు, పెదపూడి, నిడుమోలు (ఉర్దూ), మంత్రి పాలెం యుపి పాఠశాలల్లోని విద్యార్థులకు 8,9,10 తరగతిలో పుస్తకాలు పంపిణీకిసిద్ధంగాఉన్నాయి. 8వ తరగతికి 3760, పదవ తరగతికి 4521 పాఠ్యపుస్తకాలు గురువారం మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లో గల స్టాక్ పాయింట్ కు చేరుకున్నాయి. 9వ తరగతి పాఠ్యపుస్తకాలు 6006 నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం సరఫరా చేసింది. అదేవిధంగాఒకటి నుంచి ఏడవ తరగతి పాఠ్య పుస్తకాలు విజయవాడలోని పంపిణీ కేంద్రం నుంచి మొవ్వ స్టాక్ పాయింట్కు వచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి-1 ఎన్. శివ శంకరరావు, ఎంఈఓ-2 కే శ్రీ లక్ష్మిలు తెలిపారు. ఈనెల మొదటి వారంలో విద్యా కానుకలో భాగంగా పుస్తకాలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యా కానుక లోని నోట్ పుస్తకాలు మినహా మిగిలిన కానుకలు మొవ్వమండలానికి కేటాయించాల్సి ఉంది.. మొవ్వ స్టాక్ పాయింట్ లో సి ఆర్ పి లు సిహెచ్ శ్రీమన్నారాయణ (మొవ్వ), తాతా సమర్పణ రావు (కూచిపూడి), చీలి నాగరాజు (కోసూరు), సిహెచ్ నాగ హిమజ (కాజ), కంచర్ల ఆంజనేయులు (పెదసనగల్లు) పంది కృష్ణార్జునరావు(నిడుమోలు) పర్యవేక్షణలోభద్రపరిచారు.

ఘంటసాల గొప్పతనం దివిసీమకే గర్వకారణం

విశాలాంధ్ర-ఘంటసాల: ఘంటసాల గొప్పతనం దివిసీమ చరిత్రకే గర్వదాయకమని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా మండల కేంద్రమైన ఘంటసాలలోని అమరావతి బుద్ధవిహార్లో బౌద్ధ బిక్షువు పూజ్య దమ్మ దజ బంతేజీ ఆధ్వర్యంలో జరిగిన బుద్ధుని 2568 వ జయంతి కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణ దశలో ఆగిపోయిన శయన బుద్ధ ప్రాజెక్ట్ ని మరలా ప్రారంభిస్తామని, దానిని పూర్తి చేసి పర్యటకంగా ఘంటసాల ను అభివృద్ధి చేస్తామని అన్నారు. గతంలో వందల సంఖ్యలో బౌద్ధ బిక్షువులు ఘంటసాల కు వచ్చి బౌద్ధ స్థూపాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారని, అటువంటి రోజులు మరలా వచ్చేవిధంగా కృషి చేస్తామని బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల బౌద్ధ మ్యూజియంలోని బౌద్ధుని విగ్రహాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వచ్చే ఏడాది బుద్ధ పూర్ణిమకు ఘంటసాలలో అట్టహాసంగా నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రజలందరిని ఘంటసాల వైపు చూసేలా ప్రయత్నం చేస్తామన్నారు. వారసత్వ గ్రామాలలో ఘంటసాల గ్రామం ఒకటని, ఘంటసాల గ్రామాన్ని పూర్తి హెరిటేజ్ గ్రామంగా తీర్చిదిద్దదానికి కృషి చేస్తామని అన్నారు. ఘంటసాలలో శయన బుద్ధ ప్రాజెక్ట్ కోసం కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ఇచ్చిన రంగనాథబాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ మాజీ పిఎస్ఎస్ అధ్యక్షులు బండి పరాత్పర రావు ఉపసర్పంచ్ అయినపూడి భానుప్రకాష్, తెలుగుదేశం నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డి.వి. సత్యనారాయణ సహకారంతో ఎ.జి.కే హైస్కూల్ రోడ్లోని చిన్నంగంగాధర్ ఇంటి వద్ద సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు పామర్తి కేశవరావు, సెక్రటరీ డి.వి. సత్యనారాయణ, ట్రెజరర్ ఎన్. శేషగిరిరావు, బి.తిరుపతయ్య, ఎం.వీరశేఖర్, గంట చంద్రశేఖర్, కసెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా ఛాంపియన్లుగా ఎన్.టి.ఆర్. స్టేడియం పవర్ లిఫ్టర్స్

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెల 20వ తేదీన ఎన్.టి.ఆర్. జిల్లా తిరువూరు పట్టణంలో కృష్ణా మరియు ఎన్.టి.ఆర్. జిల్లాల స్థాయిలో ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్టిఆర్ స్టేడియం క్రీడాకారులు పలు పతకాలను సాధించారు. గురువారం స్థానిక స్టేడియం కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలకు కృష్ణా జిల్లా జట్టు తరుపున ఎన్.టి.ఆర్. స్టేడియం లిఫ్టర్లు ఎంపికయ్యారు. పతక గ్రహీలను ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ జంపా ఉషాకుమారి, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపిపి గద్దె పుష్ప రాణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. వివిధ శాఖల వారీగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల స్థాయి నుండి గ్రామ స్థాయి వరుకు ఇప్పటికే అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె. జ్యోతి, వైస్ ఎంపీపీ బట్టు నాగ మల్లీశ్వరీ, ఈఓపిఆర్డి డి. వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి (24 వ తారీకు) జూన్ 1వ తారీకు వరకు జరిగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ,రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గురువారం హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ పరీక్షలకు ముఖ్య పర్యవేక్షణాధికారి(సి. ఎస్)గా నియమితులైన ఇంగ్లీషు అధ్యాపకులు కే మహేష్ బాబు, సహాయ ముఖ్య పర్యవేక్షకులు (ఏ. సి. ఎస్) గా వ్యవహరిస్తున్న కామర్స్ అధ్యాపకులు ఎస్ నాగేశ్వరరావుల పర్యవేక్షణలో పంపిణీ చేశారు. ఈ కళాశాలలో నిర్వహించే సప్లమెంటరీ పరీక్షలకుపరీక్ష నిర్వహణాధికారులుగా కళాశాలలోని ముగ్గురుఅధ్యాపకులును నియమించారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్స్ 64 మంది విద్యార్థులలో, ఒకేషనల్ కోర్సు 15 మంది విద్యార్థులు, అలాగే రెండవ సంవత్సరంలో జనరల్ కోర్సులో 25 మంది, వృత్తి విద్య కోర్సులలో 11 మంది విద్యార్థులు తప్పిన సబ్జెక్టులలో పరీక్షలు రాయటానికి హాజరవుతారని సిఎస్ మహేష్ బాబు తెలిపారు. అలాగే 64 మధ్యలో బెటర్మెంట్ పరీక్షలకు 15 మంది కూడా విద్యార్థులు హాజరవుతారని వెల్లడిచేశారు.

అలీనఖీపాలెంలో కార్టెన్ సెర్చ్

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం చెలరేగిన అల్లర్లు,గొడవలు దృష్ట్యా జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి ఆదేశాలు మేరకు సమస్యాత్మకమైన అనుమానిత గ్రామాల్లో అకస్మిక తనిఖీలు చేపట్టినట్లు పమిడిముక్కల సి.ఐ.కిషోర్ బాబు తెలిపారు.గురువారం గుడివాడ డిఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అలినఖీపాలెం లో అనుమానిత ప్రదేశాలు, వ్యక్తులను ముమ్మర తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా 31 ద్విచక్ర వాహనాల కు సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఏ గ్రామము లోనైనా అల్లర్లు గొడవలు హింసాత్మక సంఘటనలు పేలుడు పదార్థాలు మారణాయుధాలు మరియు బాణాసంచా అక్రమనిల్వలు ఉంచిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు గురించి పోలీసు వారికి సమాచారం అందించాలని తప్పు చేసిన వ్యక్తి ఎంత గొప్పవాడైనా వదలమని హెచ్చరించారు..సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కిషోర్ బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు కె.శ్రీనివాస్(పమిడి ముక్కల), విశ్వనాథం (తోట్లవల్లూరు), టి.శ్రీనివాస రావు (కూచిపూడి) పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన

In the Court of the Motaor Accident Claims Tribunal Cum XII th Addl District judge at Vijayawada
M.V.O.P No: 395/2022
Between:-
Tumu Salman Raju...........Petitioner,
And
Sri Ram Genral insurance co ltd
....Respondent
To,
R1, Kodali Naresh , S/o Somaiah, Hindu Aged 20 years Rider of suzuki access bike of bearing No: AP 39 AX 0413,R/o D. No:4-95/2, lenapur (V)Pamidimukka Mandal, Krishna dt. A.P.
R2, Devara Ganesh S/o Paidi Naidu , age 19 near NTR statu, D.N. 15-136 Poranki (V) Penamaluru mandal Krishna dt.
పై నెంబరు పిటీషను లో పిటీషనర్ కు జరిగిన రోడ్డు ప్రమాదం వలన గాయపడిన దానికి నష్టపరిహారం కోరుతూ పై పిటీషన్ దాఖలు చేయగా, సదరు 1వ మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట ది. 01-07-2024 ఉదయం గం॥10.30ని॥ వాయిదా అయి ఉన్నది. కావున మీరు ప్రత్యక్షంగా గాని, లాయరు గారి ద్వారా హాజరై మీ అక్షేపణల తెలుపుకోనవలెను. లేని యెడల పరోక్షంగా తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది 01-07-2024
ఇట్లు:- నరహరిశెట్టి నరసింహారావు
న్యాయవాది, రంగన్నవీధి, విజయవాడ-1

కోర్టు ప్రకటన

In the Court of the Motaor Accident Claims Tribunal Cum XII th Addl District judge at Vijayawada
M.V.O.P No: 175/2021
Between:-
Kale Durga & others.......Petitioners,
And
M/S HDFC-ERGO Genral Insurance
....Respondents
To,
R2, Adusuilli Swrana Priya, w/o not known, Hindu Aged 20 years owner of the car bearing No: AP 27BB 0949 as per policy, R/o Flat no:46, OAK tree houses Street, street no:3 Patrika Nagar Hi-tech city Hyderabad T.S.
R3, K.Kwathik S/o Ramesh, age 40, owner of the car bearing No: AP 27BB 0949 as per c-Book, D.N. 2-24, Eedupugallu (V) Kankipadu mandal Krishna dt.
పై నెంబరు పిటీషను లో పిటీషనర్స్ తాలుకు కె.చిన్నా కు జరిగిన రోడ్డు ప్రమాదంలో డెత్ కి నష్టపరిహారం కోరుతూ పై పిటీషన్ దాఖలు చేయగా, సదరు 2వ మరియు 3వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట ది.29-5-2024 ఉదయం గం॥10.30ని॥ వాయిదా అయి ఉన్నది. కావున మీరు ప్రత్యక్షంగా గాని, లాయరు గారి ద్వారా హాజరై మీ అక్షేపణల తెలుపుకోనవలెను. లేని యెడల పరోక్షంగా తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది 29-05-2024
ఇట్లు:- నరహరిశెట్టి నరసింహారావు
న్యాయవాది, రంగన్నవీధి, విజయవాడ-1

విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ నేత పొన్నపల్లి మృతి

విశాలాంధ్ర-గుడివాడ : పట్టణ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నపల్లి బాల శివరామ ప్రసాద్ (63) గురువారం మృతి చెందారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలో ఆయన ఉపాధ్యాయ విధులు నిర్వహించి, మూడేళ్ళ క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. స్థానిక రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో వుంచిన భౌతిక కాయాన్ని సంఘ నాయకులు భవిరి శంకరనాథ్, చింతలూరి సత్యనారాయణ, వసుధ బసవేశ్వర రావు పలువురు సంఘీయులు, ఉపాధ్యాయులు గురువారం సందర్శించి పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

ఆడపిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : విద్యారంగంలో ఆడపిల్లలు తమ శక్తి సామర్థ్యాలతో చాటుతున్న ప్రతిభా పాటవాలను సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. సిబిఎస్ఈ ఫలితాలలో మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం లో ఇంటర్ ,పదవ తరగతిలో ప్రథమ స్థానాలు పొందిన కుంపటి అక్షయ మౌళి,రేవళ్ల అపూర్వ లను చల్లపల్లిలోని బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్ నందు ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు పోటీ పరీక్షలలో బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించడం శుభ పరిణామమని అన్నారు.విద్యార్థులు చదువుల్లో వివిధ కోర్సుల పట్ల పూర్తి అవగాహన పెంచుకొని చిన్నప్పటి నుండే స్పష్టమైన విద్యా లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. చదువుల ద్వారా మంచి స్థానాలను అధిరోహిస్తే వారి కుటుంబాలలో భవిష్యత్ తరాలు మరింత ఉన్నత స్థితిలో ఉండటానికి బాటలు వేసినట్లే నన్నారు. చదువుల్లో చూపే ప్రతిభను అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. పేద,మధ్యతరగతి వర్గాలు సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించడానికి చదువు మాత్రమే ఉత్తమమైన మార్గమని సురేష్ బాబు స్పష్టం చేశారు.అక్షయ, అపూర్వ లు ఇదే ప్రతిభను కొనసాగిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు దేవరపల్లి కోటయ్య,అడ్వకేట్ కుంపటి ప్రసాద్, కేంద్రీయ విద్యాలయం టీచర్లు ఆర్.విజయకుమార్, అరుణ కుమారి, ఆర్టీసీ ఉద్యోగి కె.స్వామిదాసు,కిషోర్ ఏఎన్ఎం కే.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

విశాలాంధ్ర -గుడివాడ : బుద్ధ పౌర్ణమి సందర్భంగా గుడివాడ బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత బైపాస్ రోడ్డులోని బౌద్ధ స్తూపంలో బుద్ధ భగవానుని 2568 జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బుద్ధ భగవానుని విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధ మంత్రాలను జపించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ గోగులమూడి రామకృష్ణ, బామ్ సేఫ్ రాష్ట్ర నాయకులు రాజ్ కుమార్, చంటి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నీలం ప్రభాకర్, బీఎస్పీ నాయకులు దారం కరుణాకర్ , బీసీ సంఘ నాయకులు రాజా. న్యాయవాది హేమంత్ కుమార్ ,లిటిల్ హాండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బి కార్తీక్ రామ్, కుమార్, సమీర్ భాష ,కౌశిక్ బుద్ధ భగవానుని భక్తులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్ డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఎస్.డిల్లీరావు తెలిపారు. కలెక్టర్ జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుకు కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు 403 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 504 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 364 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 1271 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్‌లో పూర్తిచేశామని తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జేసీ, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డా.పీ.సంపత్ కుమార్, డీఆర్వో శ్రీనివాసరావు, ఎన్ఐసీ డీఐఓ రేవతి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గోపి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు రామిశెట్టి

విశాలాంధ్ర-తిరువూరు: రామిశెట్టి వేణుగోపాల్‌రావు కమ్యూనిస్టుపార్టీలో చురుకైన పాత్ర పోషించారని, పార్టీ బ్యాన్ ఉన్న ఆ రోజుల్లోనే రైతాంగ ఉద్యమంలో పాల్గొంటూ... తెలంగాణ సరిహద్దు గ్రామమైన ఊటుకూరులో క్యాంప్ నిర్వహించినప్పుడు రామిశెట్టి వేణుగోపాల్‌రావు, కృష్ణయ్య అగ్ర నాయకులతో కలిసి ఆ క్యాంపుల్లో పనిచేశారని, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. ఊటుకూరులోని భూపేష్ గుప్తా భవన్‌లో గురువారం నియోజకవర్గ కమిటీ సభ్యులు సిద్ధి కొండలరావు అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ తిరువూరు నియోజకవర్గ ప్రజా సేవకుడు సీనియర్ నాయకుడు అమరజీవి కామ్రేడ్ రామిశెట్టి వేణుగోపాల్‌రావు 19వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కామ్రేడ్ వేణుగోపాల్‌రావు పరిసర ప్రాంతాలలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొని వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు దక్కించడానికి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. చాలా కాలం జైలు జీవితం కూడా గడిపారని, అజ్ఞాతలో కూడా గడిపారన్నారని దోనేపూడి గుర్తుచేశారు. ఊటుకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పనిచేశారని, సర్పంచిగా ఊటుకూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపి ఆనాటి కాలంలోనే జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నారని అన్నారు. వేణుగోపాల్‌రావు, కృష్ణయ్య ఊటుకూరు గ్రామ ప్రజాప్రతినిధులుగా ఒకరు సర్పంచిగా ఇంకొకరు కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్‌గా పనిచేశారని, వారిద్దరూ ఊటుకూరు గ్రామ అభివృద్ధిలో వారికంటూ ప్రత్యేకముద్ర వేసుకున్నారని అన్నారు. ఇప్పటికీ ఊటుకూరు గ్రామాన్ని ప్రత్యేక గ్రామంగా గుర్తించేటట్టు ఎర్రనిగడ్డ ఊటుకూరుగా పేరు దాల్చిందని, గ్రామ అభివృద్ధిలో ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పశు వైద్యశాల, ప్రభుత్వ విద్యాలయాలు, మరియు ఎస్సీ ఎస్టీ బీసీ లకు, ఇల్లు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం చేత మంజూరు చేయించి, కాలనీలలో సీసీ రోడ్లు డ్రైనేజీ మొదలగు సదుపాయాలు కల్పించారని దోనేపూడి శంకర్ అన్నారు. ముందుగా

రామ్‌శెట్టి వేణుగోపాలరావు కృష్ణయ్య విగ్రహాలకు జిల్లా పార్టీ కార్యదర్శి దోనేపూడి శంకర్, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.నాగుల్‌మీరా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూముకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడినారు. సీపీఐ తిరువూరు మండల పార్టీ కార్యదర్శి ఎస్ వనమాలి, తిరువూరు పట్టణ పార్టీ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐటీయూసీ నాయకులు కార్పెంటర్ మీరా తదితరులు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కంభంపాడులో కార్టెన్ సర్చ్

విశాలాంధ్ర-ఏ కొండూరు : కంభంపాడులో గురువారం ఏసీపీలు ఎస్ మురళీమోహన్ కె ప్రకాష్‌రావుల ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లలో సోదాలు నిర్వహించి 34 ద్విచక్ర వాహనాలను స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మురళీమోహన్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ భద్రత దృష్ట్యా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు రికార్డులు సరిగ్గా లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను పోలీస్ స్టేషన్ లో చూపించి తీసుకు వెళ్ళవచ్చని అన్నారు. తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా జరిగాయని ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాతో పాటు మైలవరం సబ్ డివిజన్లో 144 సెక్షన్ అమలులో ఉందని అందువల్ల నలుగురు మించి ఒకచోట ఉండకూడదని అన్నారు. కొందరు పై

తమకు సమాచారం ఉందని వారిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచామ న్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు సీఐ అబ్దుల్ నబీ మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురుచూపులు!

-విజయం సాధిస్తామని ఇరు పార్టీల ధీమా

-పందెం రాయుళ్ళకు నిద్రలేని రాత్రులు

-కాకి లెక్కలతో కాలం గడుపుతున్న నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఎన్నికలకు పోలింగ్ ముగిసి వారం రోజులు పూర్తయినా జిల్లాలో రాజకీయ అభిమానులు ఇంకా కాకి లెక్కలతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఒకవైపు వేసవి దుక్కులు దున్నుతూ... సమయం చిక్కితే ఏ రాజకీయ పార్టీకి ఏ మేరకు విజయావ కాశాలు ఉన్నాయో లెక్కలు వేస్తున్నారు.

పందెం రాయుళ్లకు నిద్రలేని రాత్రులు

ఓట్ల లెక్కింపు ఇంకా 13 రోజుల సమయం ఉండడంతో జయాపజయాలపై ఎవరికి తోచిన పద్ధతులలో వారు విశ్లేషణ చేస్తున్నారు. పనిలో పనిగా పందెం రాయుళ్లు మాత్రం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎక్కడ రాజకీయ చర్చ జరిగినా అక్కడ ఆసక్తిగా వింటూ తన పందెం ఉంటుందా...? ఊడుతుందా..? అన్న ఆందోళన మధ్య ఊగిసలాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలకు చెందిన నాయకులు మాత్రం విజయం పై ధీమాతో ఉన్నారు. ఏదైనా అనుమానం ఉన్న నాయకులు మాత్రం రాజకీయ విశ్లేషకులు, తమకు అనుకూలంగా ఉన్న వారితో ఓటింగ్ సరళి, ఓటర్ల మనోగతం ఏ పార్టీపై ఉంది అన్న విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు నాయకులు ఏదైతే అది అయ్యిందని విహార యాత్రలకు వెళ్లారు. ఓటరు మహాశయులు మాత్రం తమ ఓటును ఈవీయంలో నిక్షిప్తం చేశారు.

ఈవీఎంలలో అభ్యర్థుల భవిష్యత్తు

ఉమ్మడి జిల్లాలోని 14 శాసనసభ నియోజక వర్గాలకు, 2లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. పోలింగ్ ముగిసిన తరువాత పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు జిల్లాలోని నలుమూలల నుండి తీసుకు వచ్చిన ఈవీఎంలను విష్ణు కాలేజీ, ఎస్.ఆర్. కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి, ఏలూరు జిల్లాలో నియోజకవర్గాల నుంచి తీసుకువచ్చిన ఈవీఎంలను సర్ సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి తరలించి మూడంచెల భద్రత మధ్య వాటిని ఉంచారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ళ చొప్పున ఏర్పాటు చేసి ఓట్లను లెక్కించే ప్రక్రియ చేపట్టను న్నారు. పోలైన ఓట్లను బట్టి కనిష్టంగా 16... గరిష్టంగా 23 రౌండ్లలో ఓట్లను లెక్కించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. గతం

కంటే ఈసారి ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఎక్కువ మందికి ఇవ్వడంతో వాటి లెక్కింపు సుమారు రెండు గంటల పాటు ఉంటుం దని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంలలో ఓట్లను లెక్కించనున్నారు. సగటున సుమారు 20 నిమిషాలకు ఒక రౌండ్ చొప్పున ఓట్లను లెక్కించే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ లెక్కన ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు కనిష్టంగా 3 గంటలు, గరిష్టంగా 4 గంటల సమయం పట్టవచ్చని అంచనా వేస్తు న్నారు. అంటే మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మొదటి ఫలితం వెలువడుతుందని, చివరి ఫలితం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ప్రకటిస్తారని భావిస్తున్నారు. అయితే విజయావ కాశాలపై ఆయా పార్టీల నాయకులకు ఉదయం 11 గంటల సమయంలో అర్థమవుతుందని గెలుపు ధీమా ఇంకా ఉంటుందా..! సడలుతుందా..! అన్నది ఆ సమయానికి తేలిపోతుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈసారి ఎన్నికలలో 2019 ఎన్నికల తరహాలో సైలెంట్ ఓటర్ల పాత్ర కీలకంగా ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం అంత సులభం కాదని జూన్ 4 వరకు వేచి చూడాల్సిందేనని వెల్లడిస్తున్నారు.

'బడి'కి దివ్యాంగ చిన్నారులు

విశాలాంధ్ర-కంచికచర్ల: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు భవిత జిల్లా కో ఆర్డనేటర్ మహేశ్వర రావు,జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త ఎల్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కంచికచర్ల మండలంలో దివ్యాంగ పిల్లల వివరాలపై సర్వే నిర్వహిస్తున్నారు. మే1 వ తేది నుండి జూన్ 9 వరకు సర్వే నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ మహేశ్వర రావు గురువారం తెలిపారు. భవిత సెంటర్ ఉపాధ్యాయలు ఎం కనకారావుతో కలిసి ఆయన సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 180 మంది దివ్యాంగుల పిల్లలను గుర్తించి నట్లు తెలిపారు. వీరందరిని ఈ విద్యా సంవత్సరం నుండి భవిత సెంటర్లో చేర్పించి విద్యాబుద్దులు నేర్పిస్తా మన్నారు. డ్రాపవుట్స్ పిల్లలను కూడా గుర్తించి వారిని కూడా తిరిగి భవిత సెంటర్లో చేరే విధంగా పిల్లల తల్లిదండ్రు లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. భవిత సెంటర్లో చేరిన పిల్లలకు ప్రభుత్వం ప్రతినెలా ప్రయాణ ఖర్చుల నిమిత్తం 300 రూపాయలు ప్రభుత్వం అందజేస్తుంద న్నారు. అంధ విద్యార్థులకు 300 రూపాయలు అందజేస్తుందన్నారు. వీటితోపాటు ప్రభుత్వం రాయితీలతోపాటు సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సచివాలయం నుండి గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘాతో నిరంతరం అప్రమత్తంగా ఉన్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములున్న నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలల వద్ద సెంట్రల్ రిజర్వడ్ పోలీస్ ఫోర్స్, 156 మంది స్పెషల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్, 477 మంది సివిల్ పోలీస్ ఫోర్స్149 సీసీ కెమెరాలను మానిటరింగ్ రూమ్‌కు అనుసందానం చేసి నిరంతర పర్యవేక్షణతో భద్రత కల్పించామన్నారు. ఓట్ల లెక్కింపులో ఎన్నికల నిబంధనలు పాటిస్తూ సజావుగా, సక్రమంగా, ప్రశాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డా.పి.సంపత్‌కుమార్, డీఆర్వో శ్రీనివాసరావు, నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల పరీక్ష

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న పరీక్షకు జిల్లాలో 1460 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఆన్‌లైన్‌విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. నగరంలోని కండ్రికలోని ఇయాన్ డిజిటల్ జోన్, ఎస్ఎస్ ఫ్యూచర్ టెక్, వికాస్ ఇంజనీరింగ్ కాలేజ్, ఎస్ఆర్‌కె ఇన్‌స్టూట్ ఆఫ్ టెక్నాలజీ, క్యూ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్ఫో టెక్‌తో పాటు తిరువూరులోని శ్రీవాహిణీ ఇన్‌స్టూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ పరీక్ష కేంద్రాల్లో డిజిటల్ ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఆలస్యంగా వస్తే గ్రేస్ పిరియడ్‌లో 8.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు.

మాతా, శిశు మరణాల నియంత్రణపై దృష్టిపెట్టండి

జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా కృషి చేయాలని, గత మరణాలను సమగ్రంగా విశ్లేషించి పూర్తిస్థాయిలో నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గురువారం జిల్లాలో మాతా, శిశుమరణాలపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. డిసెంబర్ 23 నుండి ఏప్రిల్ 24 వరకు జరిగిన మాతృ, శిశు మరణాల నివేదికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన మాతా, శిశు మంరణాలపై సంస్థాగత, డీఎంహెచ్‌వో, జిల్లా స్థాయిలో సమగ్ర విశ్లేషణ, తద్వారా రూపొందించిన ప్రణాళికలతో మరణాలను వంద శాతం నివారించేందుకు వీలవుతుందన్నారు. ప్రతి మరణాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించాలని, పోషకాహార, జన్యు లోపాలు, సామాజిక కారణాలు, అవగాహన లోపాలను విశేషించటం ద్వారా మరణాలను ఘననీయంగా తగ్గించవచ్చునన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకునేలా గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచు గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణీల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, హైరిస్క్ ఉన్నవారి పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాధికారి డా.సుహాసిని, డీసీహెచ్ఎస్ డా.నాయక్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.అమృత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.ఇందుమతి, టీబీ వైద్యాధికారి డా.పద్మావతి, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ డా.లిడియా పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి....

- వివాదాలు సృష్టిస్తే రౌడీ షీట్ తెరుస్తాం
- వెస్ట్ ఏసీపీ మురళి కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఎన్నికలు ముగిశాక జరిగిన ఘటనలు దృష్టిలో ఉంచుకుని విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యా త్మక ప్రాంతాలను గుర్తించామని,వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని విజయవాడ వెస్ట్ ఏసీపీ మురళి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పాత రాజరాజేశ్వరి పేటలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ పి. హెచ్.డి.రామకృష్ణ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు వీలున్న ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నామని పేర్కొన్నారు. మద్యం, మందు గుండు సామగ్రి అక్రమ నిల్వలపై, అనుమానం ఉన్న వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నామని వెల్లడించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల అనంతరం ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన, అసత్య ప్రచారంతో వివాదాలు సృష్టిం చేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు.అసాంఘిక శక్తులను గుర్తించేందుకు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తూ పాత నేరస్తులను గుర్తిస్తున్నామని వివరించారు. సామాన్య ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ తిప్పా గణేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపు సమయంలో నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-గన్నవరం : జూన్ 4వ తేదీసాధారణ ఎన్నికలకు ఓట్లు లెక్కింపు జరిగే రోజున పాటించవలసిన నియమ నిబంధనలు గురించి రాజకీయ పార్టీ నాయకులు మరియు మీడియా మిత్రులకు గన్నవరం డిఎస్పి జై సూర్య ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ కాకాని కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సబ్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి. శిక్షణ డిఎస్పి వేదశ్రీ, జంక్షన్, ఎస్సై జనార్ధన్ వీరవల్లి సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి ,జంక్షన్2 అర జమ్మ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా నక్క గాంధీ. ప్రభు కిరణ్ చలపతి. జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్చార్జి చలనశెట్టి రమేష్ బాబు. టిడిపికి చెందిన వేములపల్లి శ్రీనివాసులు, దయాల రాజేశ్వరరావు ఆళ్ల గోపాలకృష్ణ, ఉమా వరప్రసాద్. రవీంద్ర. కాటూరి విజయభాస్కర్. చెన్నాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

డోగిపర్తికి సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆరు దశాబ్దాలుగా సామాజిక, సాంఘిక, విద్య, సాహిత్య, సాంస్కృతిక, దేశభక్తి రంగాలకు శారదా కళా సమితి ద్వారా తన విశిష్ట సేవలందిస్తున్న సహస్ర చంద్ర దర్శనమూర్తి డోగిపర్తి శంకరరావు కు అంతర్జాతీయ తెలుగు సంస్థ, సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్ క్లా) 2024 తెలుగు వెలుగు పురస్కారాన్ని బహూకరించిన సందర్భంగా ఆత్మీయ అభినందన సత్కారం జరిగింది. శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం, శారదా కళా సమితి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై సత్కార కార్యక్రమం జరిగింది. నాంది ప్రస్తావన ఇట్ క్లా అధ్యక్షులు సంస్కృతిరత్న డాక్టర్ కె ధర్మారావు, ముఖ్య అతిథిగా సీనియర్ పాత్రికేయులు బాయన శేఖర్ బాబు, ఆత్మీయ అతిథులుగా హనుమంతరాయ గ్రంథాలయ కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారులు నీలం దుర్గారావు, సిఏ గద్దం సత్యనారాయణ, మహబూబ్ ఆజామ్ లు, శారదా కళా సమితి కార్యదర్శి వివికె నరసింహారావు తదితరులు మాట్లాడుతూ డోగిపర్తి శంకరరావు గాంధేయవాది అని, గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి వాటిని ఆచరించడానికి, ఆచరింప చేయడానికి, వాటిని ప్రచారం చేయటానికి అహరహం శ్రమించారని, వాడు నగర కాంగ్రెస్ ఐ కమిటీలో కోశాధికారిగా ఆరు సంవత్సరములు సేవలందించి రాష్ట్ర జాతీయ నాయకులకు దగ్గరయ్యారని, విజయవాడ శ్రీ కన్యకా పరమేశ్వరి అన్న సత్రమునకు గత నాలుగున్నర దశాబ్దములుగా సహాయ కార్యదర్శిగా నేటికీ బాధ్యతలు నిర్వహిస్తుండటం ఆయన పారదర్శకతకు నిదర్శనమన్నారు. తెలుగు వెలుగు - 2024(సామాజిక సేవ) పురస్కారం భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకోవటం ఎంతో సముచితమని అంటూ అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమ నిర్వహణ శారదా కళా సమితి కన్వీనర్ ఎం ఆర్ ఎస్ ప్రకాశరావు చేసారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను పర్యవేక్షణ

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి యూపీహెచ్సీలో పలు సచివా లయలలో ప్రభుత్వం క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి వ్యాక్సినేషన్ కార్యక్ర మాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్స రాలు పైబడిన వారికి, పొగ త్రాగేవారికి, షుగర్ వ్యాధిగ్రస్తు లకు బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాంత కుమారి, సీహెచ్ గురు కుమార్, అంగన్వాడి ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుద్ధుని జయంతి

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరిలోని ఎస్సీ /ఎస్టీ రైట్‌అండ్‌యాక్ట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి మండల పరిషత్ ఆవరణలో గల, స్వర్గీయ కారుమంచి వెంకటసుబ్బయ్య చౌదరి ఉద్యానవనంలో ఉన్న గౌతమ బుద్ధిని విగ్రహం దగ్గర బుద్ధుని 2568వ జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత బుద్ధిని విగ్రహం చుట్టూ పార్కులో ఉన్న వాకర్సు అందరూ కలిసి ఆయన విగ్రహం దగ్గర పూలు వేసి ఆయనకు ఘనంగా జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ బుద్ధం శరణం గచ్ఛామి..సంఘం శరణం గచ్ఛామి అనే.. బుద్ధుని సూక్తిని స్మరిస్తూ, ఆయన ఆశయాలను, మార్గాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ చైర్మన్ కారుమంచి రామారావు, సభ్యులు బూసి గోవిందరాజు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో అల్లరి మూకలపై పోలీసులు కాల్పులు జరిపారు. వాటర్ క్యానన్‌లతో చెదరగొట్టారు. పోలీసుల కాల్పుల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కోనేరు సెంటర్ రణరంగంగా మారింది. ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు న్యాయం చేయాలంటూ కొంతమంది ఆందోళనకారులు కోనేరుసెంటర్లో ఆందోళనకు దిగడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు తొలుత లాఠీచార్జి చేశారు. వార్నింగ్‌గా గాలి లో కికాల్పులు కాల్చారు ఆ తరువాత టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఆపై వాటర్ క్యానన్‌లతో మూకలను చెదరగొట్టారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో తొలుత గాల్లోకి, అనంతరం అల్లరి మూకలపై కాల్పులు జరిగిపారు. ఈ కాల్పుల్లో పలువురికి గాయాలయ్యాయి. ఉరుము లేని పిడుగులాగా బందరులో ఒక్కసారిగా ఈ అలజడి రేగడానికి కారణమేంటంటే.. కౌంటింగ్ రోజున ఎవరైనా అల్లరి మూకలకు అల్లర్లకు పాల్పడితే పోలీసులు తీసుకునే యాక్షన్ ఎలా ఉంటుందో మాక్ డ్రిల్ చేశారట. అప్పటిదాకా ఏం జరుగుతుందో తెలియక ఆందోళన పడిన ప్రజానీకం ఇది మాక్ డ్రిల్ అని తెలియడంతో ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. సినీ ఫక్కీలో సాగిన యాక్షన్ ఎపిసోడ్‌లో పోలీసులు అల్లరిమూకలు తమ పాత్రలో సహజంగా నటించడంతో ఇదంతా నిజంగా జరుగుతుందని భావించిన జనం ఆ తరువాత ఔరా అనుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయావకాశాలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎవరికి వారు గెలుపుపై ధీమాతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కౌంటింగ్ రోజున ఓడిపోయిన రాజకీయపార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే వారిని ఎదుర్కోవడానికి, కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియచెప్పడానికి ఒం బందరు లో పోలీసులు క్రౌడ్ కంట్రోల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం గొడవ సద్దుమణిగింది. 20 నిమిషాలపాటు రణరంగాన్ని తలపించిన ఈ తతంగాన్ని చూసి అందరూ షాక్ అయ్యారు. కౌంటిగ్ రోజున ఆందోళనకారులను కట్టడి చేసేందుకు పోలీసులు తీసుకునే యాక్షన్‌లో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించినట్టు కృష్ణాజిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి. తెలిపారు కౌంటింగ్ సమయంలో, ఆ తరువాత ఎవరైనా అల్లరి మూకలు ఆందోళనలకు దిగితే పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

ఆంజనేయులు సాహితీ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-గుడివాడ : విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ఎమ్.వి.జి ఆంజనేయులు మరిన్ని పురస్కారాలు అందుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రెంట్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయంలో తెలుగు వెలుగు మహానంది పురస్కార గ్రహీత ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ జన్ను చిరంజీవిరావు, ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌బి ప్రసాద్, దూలుపూడి విజయ రాంబాబు, మోకా మాధవరావు, సయ్యద్ గఫార్, అవిర్నేని వెంకటేశ్వరరావు, గాదె మోహన్ బాబు, గొల్లేరు శ్రీనివాసరావు, చింతలూరి సత్యనారాయణ, బాదరవాడ ధర్మరాజు, ఎల్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పెడన : దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు సమగ్ర శిక్ష ద్వారా లభించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా సహిత విద్య సమన్వయకర్త కె.ఏడుకొండలు కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వుల మేరకు సహిత విద్యా రిసోర్స్ పర్సన్లు (భవిత కేంద్రం లోని ఐ.ఈ. ఆర్.పి) 0 నుండి 18 సం ల దివ్యాంగ విద్యార్థులు (ప్రత్యేక అవసరాలు గల పిల్లల) గుర్తింపు మరియు నమోదు సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు . ఈ సందర్భంగా సర్వే పర్యవేక్షణలో భాగంగా సోమవారం పెడన లో ఐ.ఈ ఆర్పి.ల సర్వే ను పరిశీలించి ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంపులు, హెూమ్ బేస్డ్ విద్య, డిజిటల్ విద్య లో భాగంగా ట్యాబ్ ల పంపిణీ, ఉచిత ఉపకరణాల పంపిణీ, వివిధ రకాల అలవెన్సులు, మొదలైనవి రాయితీలు అందిస్తున్నామని తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేగాక 3 సం ల నుండి 18 సం ల లోపు ప్రతి విద్యార్థీ అంగన్వాడీ, పాఠశాలలో లేదా కళాశాలలో నమోదు అయి ఉండాలని అన్నారు. జూన్ 9 వరకు ఈ సర్వే జరగనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్పిలు కె . నవీన్, ఎన్. శ్రీ రమ్య , అంగన్వాడీ కార్యకర్త లు పాల్గొన్నారు.

వెంకట్రామాచార్యుల కుటుంబ సభ్యులకు మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : శ్రీ వైఖానసగమ పండితులు, తెలుగు ఉపాధ్యాయులు దివంగత దీవి వెంకటరామాచార్యులు కుటుంబ సభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ గురువారం పరామర్శించారు. వెంకట రామాచార్యులు గారితో తనకు ఎంతగానో పరిచయం ఉందని విశ్వధర్మ పరిషత్ రాష్ట్ర నాయకులుగా హిందూమత వ్యాప్తికి ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. స్థానిక శిశు విద్యా మందిరం కరస్పాండెంట్ గా పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆలయ అర్చక సంఘం నేతగా కూడా అర్చకుల సంక్షేమానికి తోడ్పడ్డారని అటువంటి మహనీయుడు మన మధ్య లేకపోవడం నిజంగా విచారకరమని ఆయనకు మండలి ఘన నివాళులర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

మైలవరంలో రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): మైలవరం గ్రామ పంచాయతీ మరియు రమేష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 9 గంటల.నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్.వెంకట రామిరెడ్డి గారి ఇంటి వద్ద కల రమేష్ స్పెషాలిటీ క్లినిక్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం నందు ఉచితంగా బి.పి,ఈ.సీ.జీ.షుగర్ పరీక్షలు చేస్తారని మైలవరం మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలియచేశారు.

"ఈఎల్‌జీఐ నుంచి పర్మనెంట్ మాగ్నెట్" ఆయిల్-లూబ్రికేటెడ్ స్క్రూ కంప్రెసర్‌లు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: ప్రపంచంలోని ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీదారులలో ఒకటైన, ఈ ఎల్ జీ ఐ ఎక్విప్‌మెంట్స్ 522074 తమ ఈజీ సిరీస్ శ్రేణికి అప్‌గ్రేడ్ చేస్తూ ఈజీ %పీవీ% (పర్మనెంట్ మాగ్నెట్) ఆయిల్-లూబ్రికేటెడ్ స్క్రూ ఎయిర్ కంప్రెషర్‌లు పరిచయం చేస్తున్నట్లు సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక 15 శాతం వరకు మెరుగైన సామర్థ్య లాభాలను అందించనుండటంతో పాటుగా మెరుగైన లేదా ప్రతి కస్టమర్‌కు 16 శాతం ఉచిత ఎయిర్ డెలివరీ అందిస్తుందన్నారు. ఈజీ పీఏం సిరీస్ వినియోగదారులకు శక్తి వినియోగాన్ని తగ్గించడానికి దాని ఫలితంగా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి రూపొందించబడిన తెలివైన ఫీచర్ల శ్రేణిని అందిస్తుందన్నారు.డైరెక్ట్ కపుల్డ్ సిస్టమ్, ఆప్టిమైజ్ చేయబడిన తక్కువ మోటరు ఎయిర్‌ఎండ్ స్పీడ్‌లను అందిస్తుందన్నారు. న్యూరాన్ 4 కంట్రోలర్ ఉన్నతమైన నమ్మదగిన కంప్రెసర్ ఆపరేషన్ కోసం సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఈ విధానం పరిశ్రమ యొక్క ఉత్తమ సమయాలను నిర్వహించడానికి మరియు జీవితకాలపు ఖర్చులను తగ్గించటానికి సహాయపడుతుంది" అని అన్నారు. సిరీస్‌పై మరిన్ని వివరాల కోసం లేదా మా ఉత్పత్తుల గురించి విచారించడానికి, దయచేసి మా వెబ్‌సైట్‌ను సందర్శించండి లేదా మా మద్దతు బృందాన్ని సంప్రదించాలన్నారు.

గృహ రుణాల్లో రూ.35 వేల కోట్లను అధిగమించిన ఐఐఎఫ్ఎల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.28,512 కోట్లకు, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.35,499 కోట్లకు, ఐఐఎఫ్ఎల్ హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తన అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ లో ఇయర్ ఓవర్ ఇయర్ 25 శాతం పెరిగింది. ఇది సగటు టిక్కెట్ పరిమాణం రూ. 14.26 లక్షలతో భారతదేశపు అతిపెద్ద సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ సంస్థగా మారింది. ఈ నెల 6వ తేదీ నాటి ఎక్స్ఛేంజ్ రిపోర్టింగ్ ప్రకారం, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్స్ అథారిటీ ద్వారా 20 శాతం వాటాతో ఐఐఎఫ్ఎల్ హెూమ్ ఫైనాన్స్, 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.2,712 కోట్ల నుండి 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.3,317 కోట్లకు పెరిగి, 23 శాతం ఇయర్ ఓవర్ ఇయర్ వృద్ధిని నమోదు చేసింది. పన్ను తర్వాత లాభం 2023లో రూ.768 కోట్ల నుండి 2024లో రూ.1,017 కోట్లకు 32 శాతం పెరిగింది. నికర వడ్డీ మార్జిన్లు 80 బేసిస్ పాయింట్లు మెరుగుపడ్డాయి. 2023లో 6.5 శాతం నుండి 2024లో 7.3 శాతానికి, మూలధన సమృద్ధి నిష్పత్తి 42.7 శాతంతో బలపడింది. అదనంగా, స్థూల ఎన్పీఏ 60 బేసిస్ పాయింట్లకు పైగా మెరుగుపడింది. 2023లో 2.1 శాతం నుండి 2024లో1.5 శాతానికి తగ్గింది. దేశంలోని అన్ని సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలలో కంపెనీ అతి తక్కువ ఖర్చు ఆదాయ నిష్పత్తులను నిర్వహిస్తోంది.

వైభవంగా యాలమ్మ జాతర

విశాలాంధ్ర-అవనిగడ్డ : యాలమ్మ అమ్మవారు జాతర మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో వేంచేసి ఉన్న యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. బుధవారం జరిగిన అమ్మవారి జాతర మహోత్సవంలో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ తమ మ్రొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ మజ్జిగ, ద్రాక్ష జ్యూస్ వంటి చల్లని పానియాలను పంపిణీ చేశారు. రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అమ్మవారికి వారుసా పోసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు సమర్పించి అమ్మవారి ఆశీసులు తీసుకున్నారు. ఆలయ ఆవరణలో అమ్మవారి ఆకారాన్ని రంగు రంగుల రంగవల్లులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా ఆకర్షణగా నిలిచింది. వేకువ జామునుండే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరగా ఆలయ కమిటీకి బెస్ట్ విద్యా వాలంటీర్ కూడా సహకరించారు.

శ్రీమన్నారాయణ 25వ వర్ధంతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : సింహాద్రి శ్రీమన్నారాయణ (శివ) 25 వ వర్ధంతిని పెద్ద ఎత్తున ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సింహాద్రి శ్రీమన్నారాయణ చారిట్రబుల్ ట్రస్ట్ కన్వీనర్ వైయస్ఆర్‌సిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు బుధవారం రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింహాద్రి శ్రీమన్నారాయణ చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకంగా నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ఆర్థికంగా వెనుకబడిన వారికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు రేపల్లె రాజా, సింహాద్రి లంకేశ్వరరావు, ముడిమి అయ్యప్ప, యాసం గిరి, రేపల్లె నాంచారయ్యలతో పాటు కోట సాయి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా అమ్మవారి నెల జాతర

విశాలాంధ్ర-అవనిగడ్డ : అమ్మవారి నెల జాతర మహోత్సవం కోలాహలంగా జరిగింది. దివిసీమకు కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి నెల జాతర మహోత్సవానికి బుధవారం మన జిల్లా నుండే కాకుండా పలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మ్రొక్కుబడులను చెల్లించుకున్నారు. గత నెల 23 వ తేదిన అమ్మవారి వార్షిక జాతర నిర్వహించగా మంగళవారం రావడంతో కొంత మందికి వీలుకాక మ్రొక్కుబడులు చెల్లించుకోలేకపోయారు. నెల జాతర మహోత్సవంలో అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు ఘట్టం బిందెల మ్రొక్కుబడులు చెల్లించుకున్నారు. నెల జాతర మహోత్సవంలో భక్తులకు ప్రసాదాలను ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ అందచేయగా దేవస్థానం వారే భక్తులకు త్రాగు నీటిని సరఫరా చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వార్షిక జాతర, నెల సంబరం కూడా చడి చప్పుడు లేకుండా సజావుగా సంబరం జరిగింది. ఏ విధమైన సంఘటనలు జరగకుండా డి ఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో సిఐ త్రినాధ్ పర్యవేక్షణలో ఎస్ఐ రమేష్ పోలిస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించగా భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చెన్నా ప్రసాద్ , ఆలయ కార్యనిర్వాహణాధికారి వై శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా స్నాతకపు కావిడి మహోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : శ్రీ భునీళా రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా 2 వ రోజు అయిన బుధవారం స్నాతకపు కావిడి మహోత్సవం వైభవంగా జరిగింది. దివి పార్థ వెంకట రామా శ్రీనివాసాచార్యుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాదులోని శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారి ప్రధాన అర్చక స్వామి శ్రీమాన్ రాఘవాచార్యులు విశిష్ఠ అతిథిగా పాల్గొనగా ధర్మకర్తలు పోతరాజు ఫణి వెంకటాచల శ్రీ వాత్సవ మృణాలిని దంపతులు అర్చక స్వాములకు స్నాతకపు కావిడిలు సమర్పించారు. ముందుగా నిత్య హోమం, బలిహరణం, విశేష హోమాలు, జగాజ్యోతి, ప్రజ్వలనం, ఎదురుకోల మహోత్సవాల్లో భాగంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణగా అందచేశారు. ఆలయ కార్యనిర్వాహణాధి కారి వై శ్రీనివాసరావు, ధర్మకర్త పోతరాజు భాస్కరరావులు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండల కేంద్రమైన పెదపారుపూడి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశం ఎం పి పి గోగం సురేష్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ సీతా మహాలక్ష్మి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమకు వైభవంగా లక్ష తమలపాకు అర్చన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : వైశాఖ మాసం పూర్ణిమ రోజున వచ్చిన శ్రీకూర్మ జయంతి సందర్భంగా ముత్యాలంపాడు శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం మందిరం ఉపాలయంలో కొలువుతీరిన ఆంజనేయ స్వామికి లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు అసంఖ్యాకంగా విచ్చేసి తమలపాకు అర్చన, పూజలో భక్తి,శ్రద్ధలతో పాల్గొని ఆంజనేయుని కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతమ్ రెడ్డి, కోశాధికారి మండలపర్తి సత్య శ్రీ హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడువేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర- నందిగామ: నందిగామ మండలం మాగల్లు గ్రామంలో శ్రీ వైకుంఠ నారాయణ క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వ హిస్తున్నారు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏ ఎస్ ఎన్ సి సేవాసమితి సభ్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు అంగర రాంబాబు ఆచార్య ల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కి విశేష అర్చనలు, శ్రీ చెంచులక్ష్మి రాజ్యలక్ష్మి సమేత నారా శివ స్వామి దివ్య కళ్యాణం కన్నుల పండుగ గా జరిగింది.సచ్చివరం పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేషాలు అర్చనలు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రత పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆయా ఆలయా ల వద్ద పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరునాళ్ల

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరణాల మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభ మయ్యాయి.ఆలయ ఈవో వై సీతా రామయ్య పర్యవేక్షణ లో ఆలయ ఆసాధులు ఆధ్వర్యంలో అఖండ జ్యోతి,శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు విశేష అర్చనలు జరిగాయి.శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి పుట్టినిల్లు అయినా పల్నాడు జిల్లా దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన దిగుమతి కుటుంబ సభ్యులు, మెట్టినిల్లు వారైనా లింగాలపాడు గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కుటుంబ సభ్యులు మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు.సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున తిరణాలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ రవి కిరణ్ ఆధ్వర్యంలో సీఐ హనిష్ ప్రత్యేకం గా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాగోలు బుద్ధవిహార్‌లో బుద్ధజయంతి

విశాలాంధ్ర-చల్లపల్లి : బుద్ధ జయంతిని పాగోలు బుద్ధవిహార్లో గురువారం నిర్వహించారు. బుద్ధిస్ట్ చోడాబత్తిన ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మదుసూధనరావు, ఉపాధ్యాయులు పాల్గొని బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. బుద్ధుని బోధనలు, బౌద్ధ ఉపాసన తదితర అంశాలను ఆదినారాయణ తెలియచేశారు. బుద్ధుని 2568వ జయంతి సందర్భంగా ఆదినారాయణ పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ మదుసూధనరావును సన్మానించారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి గ్రామ పంచాయతీ నిర్వహణలోని సంపద తయారీ కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్లోని ఐదుగురు అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో కూడిన బృందం ఈ పర్యటనలో పాల్గొంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, విధులు, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, సంపద తయారీ తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించే క్రమంలో నిర్దేశిత బృంద సభ్యులు చల్లపల్లిలో పర్యటించారు. స్వచ్ఛ చల్లపల్లి సహకారంతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని, సంపద తయారీ విధానాలను పరిశీలించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి. మాధవేంద్రరావులు బృంద సభ్యులకు గ్రామంలో చెత్త సేకరణ విధానం, విభజన, నాడెపు పిట్ల నిర్వహణ, వర్మి తయారీ విధానాలను తెలియచేశారు. స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం, సంపద తయారీ, చెత్త సేకరణకు వారు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. చల్లపల్లి గ్రామంలోని సంపద తయారీ కేంద్రం నిర్వహణపై బృంద సభ్యులు సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు, కోఆర్డినేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి దేశ అభివృద్ధికి తోడ్పడాలి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు స్థానిక శాఖ గ్రంథాలయం లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులతో భగత్ సింగ్ జీవిత చరిత్ర చదివించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వి.విమలా దేవి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దేశ భక్తుల చరిత్రను చదివి తెలుసుకోవడం వలన విద్యార్థులలో దేశ భక్తి పెరుగుతుంది అని ఆవిడ అన్నారు. అలాగే ప్రతి విద్యార్థి బాగా చదివి విదేశాలకు వెళ్లకుండా సొంత దేశంలోనే ఉంటూ భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులను కోరారు. అనంతరం నిడిల్ అండ్ త్రెడ్ వంటి ఆటల పోటీలను మరియు డ్యాన్స్ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు ముగింపు కార్యక్రమం రోజున బహుమతులు అందిస్తామని గ్రంథాలయ అధికారిణి టి. వాణి తెలిపారు.